నవంబర్ 24న వచన కవిత్వ అధ్యయన శిబిరం

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 24 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నవంబర్ 24న ఆదివారం వచన కవిత్వ అధ్యయన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు ఇప్పటి వరకు వెలువరించిన కవితల వివరాలను తెలియజేస్తూ మచ్చుకు ఒక కవితను 9603727234నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించి నమోదు చేసుకోవాలని సూచించారు. సీనియర్ కవులు, విమర్శకులు ఈ శిబిరంలో కవిత్వ నిర్మాణ పద్ధతుల గురించి, కవిత్వంలో ఉండవలసిన ప్రామాణిక అంశాల గురించి వివరిస్తారని ఆయన తెలిపారు.

ప్రేంనగర్‌లో.. రేపు జాబ్ మేళా

అంబర్‌పేట, అక్టోబర్ 24 : నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 26వ తేదీన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్ షేక్ అజ్వాక్ తెలిపారు. అంబర్‌పేట ప్రేంనగర్ గ్రీన్‌ల్యాండ్ చౌరస్తాలో గల కమ్యూనిటీ హాల్‌లో ఈ మేళా ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి,18 సంవత్సరాలు నిండిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో జాబ్ పొందిన వారికి రూ.15వేల నుంచి రూ.25వేల వరకు జీతాలు ఉంటాయన్నారు. వివరాలకు 7386347792, 7842853053లో సంప్రదించాలని కోరారు.

రేపు వేద పండితులకు సత్కారం

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 24 : సత్కళాభారతి 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 26న శనివారం సాయంత్రం 6గంటలకు రవీంద్రభారతిలో పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకరభారతి స్వామి సమక్షంలో వందమంది వేదపండితులకు సత్కారం చేయనున్నట్లు సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి, పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రశాంతంగా గ్రూప్-1

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 24 : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష-2024 నాల్గవ రోజు ప్రశాంతంగా జరిగాయి. గురువారం కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలోని రెండు పరీక్షా కేంద్రాలలో గ్రూ ప్-1 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు సమయం లోపే రావడం కనిపించింది. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐలు మధుసూదనాచారి, అంకం నరేశ్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కోఠి మహిళా వర్సిటీలో వింగ్ -ఏలో 792 మంది అభ్యర్థులకు గాను 726 మంది పరీక్ష రాశారు. వింగ్-బిలో 864 మంది అభ్యర్థులకు గాను 777 మంది పరీక్ష రాశారు. వివేక్ వర్ధిని కళాశాలలో 528 మంది అభ్యర్థులకు గాను 446 మంది పరీక్ష రాశారని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు.

విద్యుత్ మీటర్ల సమస్యను పరిష్కరించండి

ట్రాన్స్‌కో అధికారులతో బస్తీవాసుల విద్యుత్ మీటర్ల సమస్యపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 24 : నల్లకుంట డివిజన్ గాంధీనగర్(లంక) బస్తీవాసుల విద్యుత్ మీటర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. గురువారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ట్రాన్స్‌కో డీఈ కమల్‌కుమార్, ఏడీఈ లు సీనయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, ఏఈ శ్రీనివాస్, శివశంకర్ తదితరులతో గాంధీనగర్(లంక) బస్తీవాసుల సమక్షంలో విద్యుత్ మీటర్ల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ గత కొంత కాలంగా పెండింగ్‌లో పెట్టిన విద్యుత్ మీటర్లకు కనెక్షన్ ఇవ్వాలని చెప్పారు. సందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క మీటర్ కూడా పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులకు తెలిపారు.

ఘనంగా 'మెథడిస్ట్' కళాశాల వార్షికోత్సవాలు

● హాజరైన సినీ నటుడు నాగ చైతన్య

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాలలో పాల్గొని ప్రసంగిస్తున్న ప్రముఖ సినీ నటుడు నాగ చైతన్య. చిత్రంలో కళాశాల కరెస్పాండెంట్ కె. కృష్ణారావు తదితరులు

అబిడ్స్, అక్టోబర్ 24 : మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థుల కేరింతల మధ్య పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. మాదాపూర్ శిల్పారామంలోని శిల్ప కళావేదిక ఆడిటోరియంలో కళాశాల కరెస్పాండెంట్ కె. కృష్ణారావు నేతృత్వంలో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవాలకు ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నగరం నడిబొడ్డున ఉన్న మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, కళాశాలలో విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని కనబరుస్తారని, కళాశాలలో విద్యార్థులకు ఉత్తమమైన బోధనతో పాటు వసతులు కల్పించేందుకు యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఇలాంటి కార్యక్రమాలు ఉండడం వలన వారు చదువుకునేందుకు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. సినీ నటుడు నాగ చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు ఓ గమ్యాన్ని నిర్ణయించుకుని అధైర్య పడకుండా ముందుకు సాగితే తప్పక విజయం సాధిస్తారని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌గౌడ్ పాల్గొని ప్రసంగిస్తూ మెథడిస్ట్ కళాశాలకు ప్రజలలో మంచి ఆదరణ ఉందని, ఈ కళాశాలను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో కరెస్పాండెంట్ కె. కృష్ణారావు కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ, కార్తికేయ 2 డైరెక్టర్ చందు మొండేటి, ప్రిన్సిపాల్ ప్రభు బెన్‌కాప్, డైరెక్టర్ లక్ష్మీపతిరావు, కళాశాల డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ సచీంద్రనాథ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు లావణ్య, మస్తానమ్మ, బాబ, డాక్టర్ రాజశేఖర్, సుజాత, అనురాధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాలలో భాగంగా శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మెథరిక్ ఉత్సవ్ పేరిట విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ప్రశంసలందుకున్నారు. ప్రధానంగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన కట్టు బట్టలతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.

వార్షికోత్సవాల్లో పాల్గొన్న నటుడు నాగ చైతన్యతో కళాశాల కరెస్పాండెంట్ కె. కృష్ణారావు తదితరులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న విద్యార్థులు

ముగిసిన నరసింహారావు శతజయంతి నాటకోత్సవాలు

తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతున్న తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీనరసింహారావు శతజయంతి నాటకోత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా కళానికతన్ సమర్పణలో కె.ఎల్ నరసింహారావు రచించిన స్వార్థం నాటికను దర్శకులు డాక్టర్ గోవాడ వెంకట్ దర్శత్వంలో అద్భుతంగా వేదికపై ప్రదర్శించి నాటక ప్రియుల మన్ననలు అందుకున్నారు. నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్ పాల్గొని నాటకోత్సవాలను విజయవంతం చేసిన కళాకారులను ఘనంగా సన్మానించారు.

– తెలుగు యూనివర్సిటీ

మూసీ బాధితులకు అండగా ఉంటాం

కార్వాన్‌లోని దరియాబాగ్ వాసులను పరామర్శిస్తున్న బీజేపీ ప్రతిపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

కార్వాన్, అక్టోబర్ 24 : మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ శాసన సభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్వాన్ మూసీ ప్రాంతంలోని పేదల ఇండ్లను కూల్చేందుకు ప్రభుత్వం నోటీసులు అందజేసి ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్న క్రమంలో బాధితులకు అండగా ఉంటామని తెలుపుతూ మహేశ్వర్‌రెడ్డి అధ్వర్యంలో బీజేపీ ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్ సింగ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మూసీ బాధితులను పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ తీర ప్రాంతంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తుంటారని 30 ఏండ్లుగా వారి కష్టార్జితంతో నిర్మించుకున్న ఇండ్లను ఎలా కురుస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్వాన్ పరిధిలోని కేసరి నగర్, దరియాబాగ్, లంగర్‌హౌస్, బాపూనగర్, రాందేవ్ గుడా ప్రాంతాలలో పర్యటించి, రాష్ట్రంలో నిరంకుశ పాలన ప్రారంభమైందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లను కూల్చడమే పనిగా పెట్టుకున్నారని, ఇదేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వేల ఎకరాల భూమి బడాబాబుల చేతుల్లో ఉందని వాటిలో వెలిసిన అక్రమ కట్టడాలను ముందు కూల్చివేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూంలు తాకితే కూలిపోతాయన్న రేవంత్‌రెడ్డి నేడు అవే డబుల్ బెడ్‌రూంలు పేదలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల కూల్చివేతలను అడ్డుకుంటాం

కాచిగూడ,అక్టోబర్ 24: మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను ప్రభుత్వం ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని హైదరాబాద్ జిల్లా సెంట్రల్ ఓబీసీ అధ్యక్షుడు చిట్టబోయిన వినోద్‌యాదవ్ అన్నారు. గురువారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. బూటకపు వాగ్ధానాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. మూసీ బాధితులకు అండగా నిలవడానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు ఉదయం 9 గంటలకు ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద మహాధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో పార్టీలకు అతీతంగా వేలాది మంది పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల శ్రేయస్సుకు మజ్దూర్ యూనియన్ కృషి



యూనియన్‌లో చేరిన వారితో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్

అబిడ్స్, అక్టోబర్ 24 : ఉద్యోగుల శ్రేయస్సుకు యూనియన్ కృషి చేస్తుందని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ అన్నారు. వివిధ యూనియన్లకు చెందిన వారు ఆదిల్‌షరీఫ్ సమక్షంలో మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం, వారి అభ్యున్నతే యూనియన్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఏబీఎస్ గాంధీని, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎం. రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్ కుమార్, నర్సింహన్, శ్రీకృష్ణ యాదవ్, మోజెస్, జి శ్రీనివాస్, రమేశ్, కొడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామన్‌గౌడ్



సూరగౌని రామన్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, అక్టోబర్ 24 : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం దీనిని పునఃపరిశీలించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రవీంద్రభారతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా సూరగౌని రామన్‌గౌడ్‌ను నియమిస్తూ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామన్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. వృత్తిదారులు, బీసీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ జాప్యం చేయకుండా వెంటనే కులగణన చేపట్టాలన్నారు. ఎంబీసీలకు అవకాశం కల్పించే విధంగా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని అన్నారు. త్వరలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో పర్యటించి మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. బీసీల హక్కుల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని, అందుకు అన్ని సంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బీసీ సంఘం ఎస్. బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతయ్య, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, నగేశ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు నియమితులైన సందర్భంగా సీనియర్ చిత్రకారుడు డి. అనంతయ్య గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

– తెలుగు యూనివర్సిటీ

స్ట్రీట్ లైట్ల సమస్య రాకుండా చూడాలి

కాచిగూడ,అక్టోబర్ 24: డివిజన్‌లోని అన్ని బస్తీలలో స్ట్రీట్ లైట్ల సమస్య రాకుండా చర్యలు తీసుకోనున్నట్లు కార్పొరేటర్ ఉమా యాదవ్ తెలిపారు. నింబోలిఅడ్డా కార్యాలయంలో విద్యుత్ డీఈ అశోక్, ఏఈ సౌమ్యలతో గురువారం కార్పొరేటర్ సమావేశాన్ని నిర్వహించి సమస్యను పరిష్కరించాలని అన్నారు.

రైల్లో దొంగతనం..

కాచిగూడ,అక్టోబర్ 24: లాల్‌ఘర్ రైల్లో ప్రయాణికుడి బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. నాంపల్లి కి చెందిన రతిలాల్‌జైన్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 5వ తేదీన లాల్‌ఘర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా ముత్కేడ్ రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న 6 గ్రా. బంగారు ఆభరణాలు, రూ.50 వేలు, ఖరీదైన 2 ఫోన్లను కనిపించలేదు. గురువారం రాత్రి ఆయన కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమో దు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ,అక్టోబర్ 24: ఫుట్‌పాత్‌పై వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ పరిదిలో జరిగింది. ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70) కాచిగూడలోని సిద్ధి వినాయక అటోమోబైల్ షోరూమ్ ముందు ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ ఏఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీషర్ట్, నషం రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.10 ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల కోసం 9032369499లో సంప్రదించాలని ఏఎస్సై కోరారు.

వ్యవసాయ వర్సిటీ అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య

సమావేశానికి హాజరైన ఉద్యోగులు, విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 24 : వర్సిటీ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ, మంచి ఫలితాలు సాధించడానికి అందరూ కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన వైస్‌చాన్స్‌లర్ జానయ్య అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో ఉద్యోగులు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. తదనుగుణంగానే యూనివర్సిటీకి కొత్త మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన సమావేశంలో వర్సిటీలో పరిశోధన, విద్య, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా జనవరి 2025 లోగా వర్సిటీలోని సమస్యలు, ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి తన జన్మహక్కుగా భావిస్తానని హామీ ఇచ్చారు. పెండిగ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. సాంకేతిక అర్హత లేకపోయినా కొన్ని ప్రైవేటు సంస్థలు వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టడం విడ్డూరమని అన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు, స్కాలర్స్, పీహెచ్‌డీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయని తెలిపారు. ఈ ఎడాది వర్సిటీకి దేశవ్యాప్తంగా 37వ ర్యాంకు ఉండగా త్వరలో 10 ర్యాంకు వచ్చేలా కృషి చేయాలని ఆయన సూచించారు. గ్రామీణ విద్యార్థులకు వ్యవసాయ విద్యను చేయడానికి రూ.10 లక్షల ఫీజును రూ. 5 లక్షలకు తగ్గించి మరో 200 సీట్లు పెంచారని ఆయన తెలిపారు. 1964 నుంచి యూనివర్సిటీ కొనసాగుతుందని, ఈసారి వజ్రోత్సవం నిర్వహిస్తామని ప్రకటించారు. అంతకుముందు ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు.

వ్యక్తి గత వాహనాలకు మల్టీటౌన్ హారన్ సైరన్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 24 : అత్యవసర సమయాలలో ఉపయోగించే మల్టీటౌన్ హారన్, ఏయిర్ హారన్, సైరన్‌లను దుర్వినియోగం చేస్తూ వ్యక్తి గత వాహనాలకు ఉపయోగిస్తూ శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కోరడా ఝుళిపించారు. ఈ మేరకు గురువారం సుల్తాన్ బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్ రాంబాబు పర్య వేక్షణలో ఎస్ఐలు సుధాకర్, శ్రీనివాస్ సిబ్బందితో కలిసి మల్టీటౌన్ హారన్, ఏయిర్ హారన్, సైరన్లను ఉపయోగిస్తున్న వాహనాలను పరిశీలించి వాటిని తొలగించి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని ట్రాఫిక్ సీఐ ఎన్ రాంబాబు అన్నారు.

బెడ్‌షీట్లు, నోట్‌పుస్తకాలు పంపిణీ

సేవాభావంతో పనిచేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మున్నూరుకాపు యువక మండలి ప్రధాన కార్యదర్శి ఎస్.పి. క్రాంతికుమార్ అన్నారు. కాంగ్రెస్ నేత ఎన్. పాండురంగ రావు 23వ వర్ధంతి సందర్భంగా గురువారం రాజన్నబావి సమీపంలోని రెయిన్‌బో అనాథ బాలికలకు ప్లేట్స్, గ్లాసులు, బెడ్‌షీట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయిషిండే, వి.యజత్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, అక్టోబర్ 24

పదోన్నతులు పారదర్శకంగా జరిగాయి

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 24 : దేవాదాయ, ధర్మాదాయ శాఖలో ఇటీవల నిర్వహించిన ఈవోల పదోన్నతులు పారదర్శకంగా జరుగలేదని ఓ వార్త పత్రిక ప్రచురించిన కథనాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈవోల సంఘం, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల జేఏసీ తీవ్రంగా ఖండించాయి. బొగ్గులకుంటలోని ఆ శాఖ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో శాఖ ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజేశ్‌కుమార్, అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి, జేఏసీ కన్వీనర్ రవీంద్రాచార్యులు మాట్లాడుతూ..శాఖలో 2,800 మంది అర్చక, ఉద్యోగులు, దేవాదాయ ప్రధాన శాఖలో 600 మంది ఉద్యోగులు కలిపి మొత్తం 34,00 మంది ఉద్యోగులు శాఖలో ఉన్నారనేది వాస్త వమని అన్నారు. చట్టంలో ఉన్న నియనిబంధనల ప్రకారమే ఈవోలుగా పదోన్నతులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు తీసుకుంటున్నామని తాము ప్రభుత్వ ఉద్యోగులమేనని స్పష్టం చేశారు.

ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గైర్హాజరు

● 5కు విచారణ వాయిదా

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : భారతీయ జనతాపార్టీ నాయకులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గురువారం కోర్టుకు గైర్హాజరయ్యారు. వచ్చే నెల 5న తప్పక హాజరుకావాలని 17వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ భారతి ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే వాయిదాకు హాజరు కావాలని కోర్టు చివరి అవకాశం ఇచ్చింది. కేసు నమోదైన తర్వాత నిందితుడికి కోర్టు సమన్లు జారీ చేసింది. అప్పటినుంచి ఇప్పటి వరకు నిందితుడి తరపున న్యాయవాది గైర్హాజరు పిటీషన్‌ను కోర్టుకు దాఖలు చేశారు. కోర్టు సైతం గైర్హాజరు పిటీషన్లను అంగీకరించి వాయిదా వేసింది. వచ్చే వాయిదాకు చివరి అవకాశంగా పేర్కొంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ నిందితుడిపై దాఖలు చేసిన పరువు నష్టం కేసుకు గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఆమెపై తప్పుడు ఆరోపణలు చేసినట్టు మీడియాలో వచ్చిన కథనాలకు సంబంధించిన సాక్షాధారాల్ని కోర్టుకు సమర్పించారు. కోర్టుకు చేసిన ఫిర్యాదు ప్రకారం దీపాదాస్ మున్షీ చీఫ్ ఎగ్జామినేషన్ ప్రక్రియతోపాటు నిందితుడి తరపు న్యాయవాది క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సి ఉంది. నిందితుడి ఇప్పటివరకు కేసుకు సంబంధించిన పత్రాలను హాజరై తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే నెల 5న నిందితుడు కోర్టుకు హాజరై కేసు పత్రాలను తీసుకునే అవకాశముంది. లేని పక్షంలో కోర్టు నిందితుడిపై వారెంట్ జారీ చేసేందుకు వీలుంటుంది.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 24: వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్, ఎమ్